సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| బుధవారం 08 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 310 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## రవాణా శాఖపై రాష్ట్ర స్థాయి సమీక్ష ప్రారంభం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 08, ప్రతినిధి: సచివాలయంలో రవాణా శాఖపై మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ కె. ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, రమేష్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో రవాణా శాఖలో అమలు చేస్తున్న విప్లవాత్మక సంస్కరణలకు సంబంధించిన బుక్‌లెట్‌ను మంత్రి ఆవిష్కరించారు. రహవీర్ పథకం అమలులోకి వచ్చిన తర్వాత తొలి అవార్డు గ్రహీతగా నల్గొండ జిల్లాకు చెందిన గణపతి వెంకన్నకు రూ.25 వేల చెక్కును మంత్రి అందజేశారు. అలాగే 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో శాఖ ఆదాయం, లక్ష్యాలను చేరుకున్న జిల్లాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను పెంచుతూ ఆదాయ మార్గాలను విస్తరించాలని అధికారులకు మంత్రి సూచించారు.



## అమెరికా-భారత్ ప్రతినిధి బృందంతో సీఎస్ సమావేశం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 08, ప్రతినిధి: అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరమ్ నుండి వచ్చిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావుతో సమావేశమైంది. ఈ సందర్భంగా బీమా, ఆర్థిక సేవలు, వ్యవసాయం, సాంకేతిక రంగాలకు చెందిన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పడినప్పటి నుంచి వివిధ రంగాల్లో విశేష అభివృద్ధి సాధించిందని సీఎస్ వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులతో రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, నగరీకరణ వేగంగా జరుగుతున్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటని, హైదరాబాద్ దేశంలోనే ఔషధ రాజధానిగా, సమాచార సాంకేతిక రంగంలో ముందంజలో ఉందని తెలిపారు. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, విద్యాసంస్థలు, ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు, బలమైన ఫిన్‌టెక్ వాతావరణం పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని చెప్పారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం, నైపుణ్య మానవ వనరులు, సాంస్కృతిక వారసత్వం వంటి అంశాలు రాష్ట్రానికి బలమని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, మలాచీ బ్రియాన్ నుగెంట్, ఆర్ దీపక్ జోషి, దివదృష్ట్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.




## రైతునేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల సూచనలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 08, ప్రతినిధి: ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. యూరియా యాప్ మరియు యూరియా వినియోగంపై రైతుల అభిప్రాయాలను సేకరించిన మంత్రి, యాప్ ద్వారా లైన్లలో నిలబడే ఇబ్బందులు తొలగిపోయాయని, ఇంటి నుంచే యూరియాను బుక్ చేసుకునే సౌకర్యం కలిగిందని రైతులు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. రైతుల అభిప్రాయాల మేరకే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేసిన మంత్రి, యూరియాను శాస్త్రీయంగా వినియోగించాలని సూచించారు. అధిక యూరియా వాడకం వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు చీడపీడల సమస్యలు పెరిగి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పంట కోతల అనంతరం వ్యర్థాలను కాల్చవద్దని, పర్యావరణ పరిరక్షణకు రైతులు సహకరించాలని కోరారు. పామాయిల్ పంటను ఇతర పంటలతో పాటు సాగు చేస్తే స్థిరమైన అధిక ఆదాయం సాధ్యమని వివరించారు. ఇదే సందర్భంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి, డంపింగ్ యార్డు పనులను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ కూడా పాల్గొన్నారు.

## సాగునీటి తక్షణ విడుదలకు మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 08, ప్రతినిధి: తెలంగాణ మానవ హక్కుల కమిషన్ గౌరవ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన SR నం.1372 & 1373/2026 కేసుల్లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ సంగారెడ్డి జిల్లాలోని ఘనపూర్ అనికట్ కింద సాగు చేస్తున్న రైతులకు సాగునీరు విడుదల కాకపోవడంపై తీవ్రంగా స్పందించింది. సుమారు 20 వేల ఎకరాల్లో సాగుచేసిన వరి పంట కోత దశలో ఉండగా నీటి కొరత వల్ల పంట నష్టపోయే ప్రమాదం ఉందని గమనించిన కమిషన్, ఇది రైతుల జీవనోపాధి, గౌరవప్రద జీవనం మరియు ఆహార హక్కులకు భంగం కలిగిస్తుందని అభిప్రాయపడింది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993లోని సెక్షన్ 18(c) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని తక్షణం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి ఎం. బయ్యారెడ్డి సింగూర్ ప్రాజెక్టు నుండి వనదుర్గ ప్రాజెక్టు (ఘనపూర్ అనికట్) కు 0.30 టీఎంసీ నీటిని 12 రోజులపాటు విడుదల చేయాలని సిఫార్సు చేసింది. అలాగే తీసుకున్న చర్యల నివేదికను ఈ నెల 30లోపు కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించింది.



## వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ఆరోగ్య రంగానికి బలోపేతం – మంత్రి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 08, ప్రతినిధి: వరల్డ్ హెల్త్ డే సందర్భంగా రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగిస్తూ "Together for Health – Stand with Science" అనే ఈ ఏడాది థీమ్ ఆరోగ్య రంగంలో శాస్త్రం, సహకారం, ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతను తెలియజేస్తుందని అన్నారు. ఆరోగ్యం అంటే కేవలం వ్యాధులు లేకపోవడం మాత్రమే కాకుండా శారీరక, మానసిక, సామాజిక పరంగా సంపూర్ణ ఆరోగ్యం కావాలని, ప్రజల ఆరోగ్యమే అభివృద్ధి చెందిన సమాజానికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది సేవలను ప్రశంసిస్తూ, కోవిడ్ సమయంలో చేసిన సేవలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ప్రాథమిక స్థాయి నుంచి సూపర్ స్పెషాలిటీ స్థాయి వరకు ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తున్నామని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఔషధాలు, డయాగ్నోస్టిక్ సేవలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. జీవనశైలి మార్పులతో డయాబెటిస్, బీపీ, గుండె, క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రివెంటివ్, ప్రమోటివ్, క్యూరేటివ్, రిహాబిలిటేటివ్ విధానాలతో సమగ్ర సేవలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా NCD క్లినిక్స్, డే కేర్ క్యాన్సర్ సెంటర్లు, ట్రామా కేర్ కేంద్రాలు ఏర్పాటు చేస్తూ, రూ.1100 కోట్లతో నాలుగు స్థాయిల ట్రామా కేర్ వ్యవస్థను అమలు చేస్తున్నామని, అంబులెన్స్ సేవలను బలోపేతం చేస్తూ 213 వాహనాలు అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. క్యాన్సర్‌ను నోటిఫైబుల్ వ్యాధిగా ప్రకటిస్తూ, NIMSలో అత్యాధునిక LINAC సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ముందస్తు నిర్ధారణ చర్యలు చేపడుతున్నామని, AstraZeneca తో కలిసి లంగ్ క్యాన్సర్ పై పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలను విస్తరిస్తూ ప్రజల ఆర్థిక భారం తగ్గిస్తున్నామని, ఉద్యోగులు, పెన్షనర్ల కోసం కొత్త ఆరోగ్య పథకాన్ని తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. TIMS ఆసుపత్రులు, వరంగల్ హెల్త్ సిటీ, కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంతో పాటు NIMSలో 2000 పడకల భవనం నిర్మాణం జరుగుతోందన్నారు. రెండు సంవత్సరాల్లో 10 వేల పోస్టులు భర్తీ చేసి, మరో 7 వేల పోస్టుల భర్తీ కొనసాగుతోందని తెలిపారు. ప్రతి రోగిని గౌరవంతో చూసుకోవాలని సూచిస్తూ, విధి నిర్వాహణలో ఉత్తమ సేవలు అందించిన డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందికి మంత్రి అవార్డులు అందజేశారు.




## రైల్వే ప్రాజెక్టుల పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి: సీఎస్

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 08, ప్రతినిధి: రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు ఆదేశించారు. సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో రైల్వే అండర్ బ్రిడ్జిలు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ, చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ప్రజా రవాణా మెరుగుదల తదితర సుమారు 21 అంశాలపై సమగ్రంగా చర్చించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని, మున్సిపల్, జలమండలి, రెవెన్యూ, విద్యుత్, రోడ్లు భవనాల శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పరిష్కార మార్గాలు చేపట్టాలని సీఎస్ సూచించారు. త్వరలో రైల్వే ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నందున ప్రతీ పెండింగ్ అంశంపై పూర్తి నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, జయేష్ రంజన్, నవీన్ మిట్టల్, టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచి ఆదాయం పెంచాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 08, ప్రతినిధి: రవాణా శాఖలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ బలోపేతం చేస్తూ ఆదాయాన్ని పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ 2024-25లో రూ.6910.90 కోట్లు, 2025-26లో రూ.7097.38 కోట్లు ఆదాయం వసూలైనట్లు తెలిపారు. ఈవీ పాలసీ కారణంగా కొంత ఆదాయం తగ్గిన నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా ఆదాయ మార్గాలను విస్తరించాలని సూచించారు. లక్ష్యాలను చేరుకున్న జిల్లాల అధికారులను అభినందిస్తూ, పనితీరు మెరుగుపరచని వారికి హెచ్చరికలు జారీ చేశారు. సారథి అమలులోకి వచ్చిన 8 నెలల్లోనే తెలంగాణ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. వాహన్ పోర్టల్ డేటాను పూర్తిచేసి సాంకేతిక సమస్యలు లేకుండా చూడాలని, జూన్ 1న ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ ప్రారంభానికి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏఎంవీఐలకు ఇచ్చిన శిక్షణ మాదిరిగా ఇతర అధికారులకు విడతల వారీగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు రహవీర్ పథకం, క్యాష్‌లెస్ ట్రీట్మెంట్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని, 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని పోలీసులతో సమన్వయంగా విజయవంతం చేయాలని అన్నారు. సరిహద్దు జిల్లాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఓవర్‌లోడింగ్, మైనింగ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో 17 జిల్లాల్లో రవాణా శాఖ కార్యాలయాలకు స్థలాలు గుర్తించాలని, పెండింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ప్రమాద సమయంలో సహాయం చేసిన వారికి రహవీర్ అవార్డు కింద రూ.25 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తున్నామని, నల్గొండ జిల్లాకు చెందిన గణపతి వెంకన్నకు తొలి అవార్డు అందజేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి తదితర అధికారులు పాల్గొన్నారు

# అక్షర హై స్కూల్‌పై ఏబీవీపీ ఆగ్రహం



సందేశం టైమ్స్, వట్టిపల్లి, ఏప్రిల్ 08, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండల కేంద్రంలోని అక్షర ప్రైవేట్ హై స్కూల్ ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను ఉల్లంఘిస్తూ ఒంటిపూట బడి అమలు చేయకుండా పూర్తి సమయంతో పాఠశాలను నిర్వహిస్తున్నందుకు ఏబీవీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జీవో ప్రకారం మధ్యాహ్నం 12:30 గంటల వరకు మాత్రమే తరగతులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, పాఠశాలను మధ్యాహ్నం 2:00 గంటల వరకు నడిపించడం స్పష్టమైన ఉల్లంఘనగా పేర్కొంది. ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించింది. స్థానిక ఎంఈఓ ప్రైవేట్ పాఠశాలలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అక్షర హై స్కూల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని, ఇకపై ఇదే పరిస్థితి కొనసాగితే పాఠశాల గుర్తింపును రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ఏబీవీపీ సంగారెడ్డి జిల్లా హాస్టల్ కన్వీనర్ సాయికృష్ణతో పాటు కార్యకర్తలు హెచ్చరించారు.




## పారాక్వాట్ గడ్డిమందుపై నిషేధం – జీవో 24 విడుదల

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 08, ప్రతినిధి: తెలంగాణలో పారాక్వాట్ గడ్డిమందుపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధిస్తూ జీవో నంబర్ 24ను విడుదల చేసింది. ఈ మేరకు ఈ మందు తయారీ, నిల్వ, పంపిణీ, అమ్మకాలను చట్ట విరుద్ధంగా ప్రకటిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. తక్కువ మోతాదులో ఉపయోగించినప్పటికీ ఈ గడ్డిమందు శరీర అవయవాలకు తీవ్రమైన హాని కలిగించడమే కాకుండా కూరగాయలను విషపూరితంగా మార్చే ప్రమాదం ఉందని, వాతావరణంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని వ్యవసాయ శాఖ వెల్లడించింది. ప్రజల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.




## వట్‌పల్లి శివారులో అక్రమ గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

సందేశం టైమ్స్, వట్‌పల్లి, ఏప్రిల్ 08, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి గ్రామ శివారులో ఎస్సై లవ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, మండల పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ ప్రణీత బృందం సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. శుభశ్రీ ఫ్యామిలీ డాబా హోటల్ నిర్వాహకుడు కళాలి ఎల్లా గౌడ్ వద్ద రెండు, భవాని ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమాని అనిల్ వద్ద రెండు, ఆర్. లక్ష్మారెడ్డి ఇంట్లో నాలుగు సిలిండర్లు అక్రమంగా నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధం చేసినట్లు గుర్తించారు. స్వాధీనం చేసిన సిలిండర్లపై సంబంధిత ముగ్గురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై లవ కుమార్ తెలిపారు. అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

## సంగారెడ్డి జిల్లాలో అగ్నిమాపక భద్రత తనిఖీలు ప్రారంభం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 08, ప్రతినిధి: తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో పరిశ్రమలు, నివాస, విద్యా, వాణిజ్య సంస్థల్లో అగ్నిమాపక భద్రత ప్రమాణాల అమలుపై ప్రత్యేక తనిఖీలు ప్రారంభించినట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి. నాగేశ్వరరావు తెలిపారు. ప్రతి వారం ముందస్తు నోటీసులు జారీ చేసి నేషనల్ బిల్డింగ్ కోడ్ ప్రకారం అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, నిర్వహణపై యాజమాన్యాలకు సూచనలు ఇస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం పటాన్‌చెరు, ఐడీఏ పశామైలారం ప్రాంతాల్లోని పరిశ్రమలను తనిఖీ చేసి సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో కొన్ని పరికరాలు పనిచేయకపోవడం, సరైన నిర్వహణ లేకపోవడం వంటి లోపాలు గుర్తించి వెంటనే సరిచేయాలని ఆదేశించారు. అగ్నిమాపక భద్రత ప్రమాణాలు పూర్తిగా అమలు చేసిన తర్వాత నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం ఫైర్ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రాణాలు, ఆస్తులను రక్షించడమే ఈ ప్రత్యేక తనిఖీల ముఖ్య ఉద్దేశ్యమని, జిల్లాలో భద్రతా నియమాలు కచ్చితంగా అమలయ్యేలా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# యువత ముందుకు వస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం – కలెక్టర్ ప్రావీణ్య






సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 08, ప్రతినిధి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య జెండా ఊపి ప్రారంభించారు. మెడికల్ కాలేజీ నుంచి ఐబి వరకు జరిగిన ఈ రన్‌లో విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్య శాఖ వారం రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారా వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని, యువత ముందుగానే ఆరోగ్యంపై దృష్టి సారించడం శుభపరిణామమని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన సమతుల్య ఆహారం, వ్యాయామం, పరిశుభ్రత, మానసిక ప్రశాంతత పాటించాలని సూచించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథంతో జీవనశైలిలో మార్పులు చేసుకుంటే అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. ప్రకాష్ రావు, జిల్లా వైద్యాధికారి డా. వసంతరావు, డీఎస్పీ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ చేతుల మీదుగా 'సందేశం టైమ్స్' క్యాలెండర్ ఆవిష్కరణ

**“నిజం దాగదు... వార్త ఆగదు” నినాదంతో క్యాలెండర్ ఆవిష్కరణ**







సందేశం టైమ్స్ సంగారెడ్డి ఏప్రిల్ 8ప్రతినిధి “సంగారెడ్డి జిల్లాలో ‘నిజం దాగదు వార్త ఆగదు’ అనే నినాదంతో సందేశం టైమ్స్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి గారి చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించగా, డిస్ట్రిక్ట్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీడి లలిత కుమారి గారు ప్రత్యేకంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, జర్నలిజం సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ టి. సంగమేశ్వర్, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్, అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కే. మల్లేశం గౌడ్, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోచయ్య మన్నే, పుల్కల్ మండల్ రిపోర్టర్ మహేష్ బాబు, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు భైండ్ల కృష్ణ, జహీరాబాద్ డివిజన్ ఉమెన్ ప్రొటెక్షన్ జాయింట్ సెక్రటరీ బి. సుమిత్ర తదితరులు పాల్గొన్నారు. సందేశం టైమ్స్ ప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.”

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పౌష్టికాహారం కీలకం






సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 08, ప్రతినిధి: సంగారెడ్డి తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ మరియు జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ పౌరులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా పనిచేసి దేశ అభివృద్ధికి తోడ్పడతారని తెలిపారు. దేశంలో పౌష్టికాహార లోపం ఎక్కువగా ఉండటంతో ముఖ్యంగా స్త్రీలు, బాలికలు సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మహిళల్లో పోషకాహార లోపం తీవ్రంగా ఉండటానికి అందుబాటు లోపం ప్రధాన కారణమని చెప్పారు. బాలబాలికలకు సరైన పౌష్టికాహారం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థినుల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ జోష్ణ, డాక్టర్ సదయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బేతాళ స్వామి జాతరలో మజ్జిగ పంపిణీ



సందేశం టైమ్స్, అల్లాదుర్గం, ఏప్రిల్ 08, ప్రతినిధి: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని శీలం కోటలో నిర్వహించిన బేతాళ స్వామి జాతర మహోత్సవంలో భాగంగా శ్రీరామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు అడికే జగదీశ్వర్ పటేల్ హాజరై భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. వేడికాలంలో భక్తులకు ఉపశమనం కలిగించే ఇలాంటి సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తడ్కల్‌లో రైతు బజార్ వేలంపాట విజయవంతం... రూ.2.66 లక్షలకు కైవసం

సందేశం టైమ్స్, కంగ్టి, ఏప్రిల్ 08, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని తడ్కల్ గ్రామంలో రైతు బజార్‌కు సంబంధించిన వేలంపాట కార్యక్రమం మంగళవారం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ వేలంపాటలో రెడ్డి హన్మండ్లు రూ.2.66 లక్షలకు కైవసం చేసుకోగా ఒప్పందం మార్చి 2027 వరకు అమల్లో ఉండనుంది. గ్రామ సర్పంచ్ ఎలిచల సుగుణ మల్లారెడ్డి అధ్యక్షతన, గ్రామ కార్యదర్శి జ్ఞాన్ దేవ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతు బజార్ ద్వారా రైతులు తమ పంటలను నేరుగా విక్రయించుకునే అవకాశం లభించి మధ్యవర్తులు తగ్గడంతో మంచి లాభాలు పొందగలరని అధికారులు తెలిపారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు అవసరమని, రైతులకు మరింత సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు.



## ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలి

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 08, ప్రతినిధి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హవేలీఘనాపూర్ మండలంలోని సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశీలించి స్వయంగా పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ “Together for Health – Stand With Science” అనే థీమ్‌ను ప్రస్తావిస్తూ ప్రజలు శాస్త్రీయ దృక్పథంతో ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధుల లేమి మాత్రమే కాకుండా శారీరక, మానసిక, సామాజిక సంక్షేమం కలగలిపిన సమగ్ర స్థితి అని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవడం, నియమిత వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లను అలవరచుకోవాలని, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించి మిల్లెట్ ఆహారం, పండ్లు, కూరగాయలు అధికంగా తీసుకోవాలని సూచించారు. మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా పరిగణిస్తూ ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం వంటి పద్ధతులను అనుసరించాలని తెలిపారు. సీజనల్, జీవనశైలి సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, స్థానిక సర్పంచ్, పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పెన్షన్ లబ్ధిదారులపై ముఖ నిర్ధారణ ప్రక్రియ ప్రారంభం


సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 08, ప్రతినిధి: జిల్లాలో ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న వారిపై పక్కాగా ఫేషియల్ (ముఖ) నిర్ధారణ ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో మాట్లాడుతూ మెదక్ పట్టణం ఈ ప్రక్రియకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందని తెలిపారు. యాప్ ద్వారా పెన్షన్ లబ్ధిదారుల ముఖ నిర్ధారణ చేపడుతున్నామని, ఈ ప్రక్రియ రెండు రోజులపాటు మెదక్ పట్టణంలోని 7, 20, 21, 22 వార్డుల్లో కొనసాగుతుందని చెప్పారు. వార్డ్ అధికారులు, మెప్మా సిబ్బంది నాలుగు బృందాలుగా విభజించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. నిర్ధారణ పూర్తయిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని, మరణించిన వారిని పెన్షన్ పథకం నుంచి తొలగించి నిజమైన లబ్ధిదారులను గుర్తించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని వివరించారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ శ్రీనివాసరావు, సర్ప్ డైరెక్టర్ సోషల్ సెక్యూరిటీ గోపాల్, ప్రాజెక్ట్ మేనేజర్ గోవర్ధన్, టీజీ ఆన్‌లైన్ కృష్ణంరాజు, మృణాల్ తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 08, ప్రతినిధి: పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ తన నివాసంలో పంపిణీ చేశారు. మొత్తం 18 మంది లబ్ధిదారులకు రూ.7,29,000 మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం స్థానిక నాయకులు, ప్రజల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి వైద్య అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సహాయం అందేలా కృషి చేస్తామని, ప్రజల సంక్షేమం తమకు ముఖ్యమని పేర్కొన్నారు. లబ్ధిదారులు అందిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో అద్భుత దృశ్యం



సందేశం టైమ్స్, అల్లాదుర్గం, ఏప్రిల్ 08, రూరల్ ప్రతినిధి: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఉదయం సూర్యోదయ సమయంలో భానుడి కిరణాలు నేరుగా గర్భగుడిలోని మూలవిరాట్‌పై పడటంతో భక్తులు పరవశించిపోయారు. ఈ దృశ్యాన్ని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పూజారి ప్రవీణ్ శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భానుడి కిరణాల స్పర్శను దర్శించుకోవడం తమ అదృష్టమని భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు కోరుకున్నారు.


## అల్లాదుర్గంలో బేతాళ స్వామి జాతర ఘనంగా





సందేశం టైమ్స్, అల్లాదుర్గం, ఏప్రిల్ 08, రూరల్ ప్రతినిధి: మండల కేంద్రమైన అల్లాదుర్గంలో బేతాళ స్వామి జాతర మూడు–నాలుగు రోజులుగా ఘనంగా జరుగుతోంది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధతో స్వామివారి కోరికల మేరకు బండ్లు ఊరేగింపులో స్వామివారికి సమర్పించారు. అనేక భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతో ఆలయం భక్తులకు విశేష ఆకర్షణగా నిలిచింది. ప్రతి సంవత్సరం వేర్వేరు రకాల పూజలతో బోనాలు నిర్వహించి వేల సంఖ్యలో భక్తులు తమ కోరికలు తీర్చుకుంటారు. ఈ బేతాళ స్వామి దేవాలయం అల్లాదుర్గంలో ఉండడం భక్తులు అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

## చలో ఇంద్ర పార్క్ – బీసీ కాంట్రాక్టర్ల న్యాయ పోరాటానికి టీఆర్పీ మద్దతు




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 08, ప్రతినిధి: తెలంగాణలో బీసీ కాంట్రాక్టర్లకు 42% కాంట్రాక్టులు ఇచ్చే హామీని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చినా, ఆ హామీని అమలు చేయకపోవడంపై వ్యతిరేకత వ్యక్తం చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ బీసీ కాంట్రాక్టర్ల న్యాయ పోరాటానికి మద్దతు ప్రకటించింది. రేపు ఉదయం 10 గంటలకు ఇందిరా పార్క్ వద్ద జరగబోయే మహా ధర్నాలో పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారు పాల్గొని బీసీ కాంట్రాక్టర్ల పూర్ణ మద్దతును ప్రకటిస్తారు. పార్టీ కార్యాలయం ప్రకారం, 42% హామీ అమలు అయ్యేవరకు పోరాటం ఆగదని, బీసీ హక్కులు దోచుకునే పాలనను మరింత సహించవద్దని, బీసీ కాంట్రాక్టర్ల బిల్లులను వెంటనే చెల్లించాల్సినదిగా, అగ్రవర్ణాల కాంట్రాక్టర్ల పెత్తనం ఇక అనుమతించబడరని, బీసీ హక్కుల కోసం టీఆర్పీ ఎల్లప్పుడూ ముందుంటుందని వాదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరై బీసీ హక్కుల కోసం నిరంతరం పోరాడతామని హామీ ఇచ్చారు.

## రాజధానికి చట్టబద్దత కల్పిస్తూ గెజిట్ విడుదల: సీఎం చంద్రబాబు హర్షం

సందేశం టైమ్స్, ఏప్రిల్ 08, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చిరకాల స్వప్నమైన రాజధాని చట్టబద్ధతను సాకారం చేస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) చట్టం, 2026 కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపిన సందర్భంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ చట్టానికి మద్దతుగా నిలిచిన కేంద్రం, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని సర్కార్, ఎంపీలు, మరియు ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు తెలిపారు, ఇది రాజధాని అమరావతి రైతులు మరియు రాష్ట్రాభివృద్ధికి గొప్ప విజయం అని, రాజధాని నిర్మాణం, అభివృద్ధి పథకాలను ఇప్పుడు చట్టబద్ధంగా కొనసాగించడానికి వీలు కల్పించిన ఘట్టమని పేర్కొన్నారు.



## హెడ్ కానిస్టేబుల్ రేవతి: సాత్తాన్‌కుళం లాకప్ మరణాల కేసులో న్యాయానికి కీలక సాక్షి

సందేశం టైమ్స్, ఏప్రిల్ 08, ప్రతినిధి: తమిళనాడులో సాత్తాన్‌కుళం లాకప్ లో జరిగిన దారుణ మరణాల కేసులో 9 మంది తోటి పోలీసులకు ఉరి శిక్ష విధించడానికి కీలక సాక్షిగా నిలిచిన హ◌ెక కానిస్టేబుల్ రేవతి గారి ధైర్యం, నిజం ప్రతిపాదన ప్రతిష్ఠాత్మక ఉదాహరణగా నిలిచింది. స్టేషన్ లోని ఒత్తిడి, సాక్ష్యాలను తుడిచివేయాలనే ప్రయత్నాలు, పై అధికారుల ఒత్తిడి మధ్యన కూడా ఆమె వెనక్కి తగ్గకుండా మేజిస్ట్రేట్ ముందు ప్రతి విషయాన్ని స్పష్టంగా వివరించి, దారుణానికి సంబంధించిన నిజాలు బయటపెట్టారు. గోడల మూలల్లో, టేబుళ్ల కింద మిగిలిన రక్తపు మరకలను గుర్తించి, మాయమయ్యిన సీసీటీవీ ఫుటేజీని కూడా తన జ్ఞాపకశక్తితో సమయాలను పూసగుచ్చి వివరించడంతో కేసుకు బలమైన ఆధారాలు సమకూర్చారు. ఆమె సాహసం, నిజానుసారమైన చర్యలు కేసు దిశను మార్చి, కోర్టు ప్రత్యేక రక్షణ కల్పించడానికి కారణమయ్యాయి. సాధారణ పరిస్థితుల్లో చాలా మంది చేయలేని నిజాన్ని చెప్పి వ్యవస్థకు వ్యతిరేకంగా నిలబడిన రేవతి గారి ధైర్యం, నిష్ఠ, నిజం మాత్రమే సాత్తాన్‌కుళం కేసులో న్యాయం సాధించడానికి ప్రధాన కారణమని ఆమెకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిన అవసరం ఉంది.




## దళిత క్రైస్తవుల రిజర్వేషన్ల కోసం ఉమ్మడి పోరాటం చేద్దాం: మంద కృష్ణ మాదిగ

గుంటూరు, సందేశం టైమ్స్, ప్రతినిధి శెట్టి వెంకటేష్, ఏప్రిల్ 08, 2026: దళిత క్రైస్తవులకు ఎస్సీ (SC) హోదా వర్తించదన్న 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎమ్మార్పీఎస్ (MRPS) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఉత్తర్వు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 మరియు 25లకు పూర్తిగా విరుద్ధమని, కుల మత భేదం లేకుండా అందరూ సమానమని రాజ్యాంగం చెబుతుంటే దళితుల పట్ల వివక్ష చూపడం దారుణమని మండిపడ్డారు. బీసీ, ఈడబ్ల్యూసీ (EWC) కేటగిరీల్లోని వివిధ ముస్లిం వర్గాలు ఏ మతంలో ఉన్నా రిజర్వేషన్లు అనుభవిస్తున్నప్పుడు, కేవలం దళితులకు మాత్రమే ఈ వివక్ష ఎందుకని ఆయన ప్రశ్నించారు. భారతదేశంలో కుల వ్యవస్థకు, అసమానతలకు బ్రాహ్మణులే కారణమని, గతంలో బ్రిటీష్ వారితోను, రాజులతోను చేతులు కలిపి కీలక పాత్ర పోషించిన వారు నేడు దళిత క్రైస్తవుల రిజర్వేషన్లకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. అగ్రకులాలకు చెందిన పాస్టర్లు కోట్లు సంపాదిస్తుంటే, సైకిళ్లపై వెళ్లే దళిత పాస్టర్లపై దాడులు జరగడం విచారకరమని, దళిత క్రైస్తవుల అస్తిత్వం కోసం దీనిని ఒక ఆత్మగౌరవ ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు. దళిత సోదరులందరూ తమ అంతర్గత విభేదాలను పక్కన పెట్టి, పేదలందరికీ న్యాయం జరిగేలా కుల వ్యవస్థ రద్దు కోసం మరియు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.



## బస్సుల్లో సీట్లపై టాక్సేషన్ తగ్గించేలా చర్యలు తీసుకుంటాం: మంత్రి రాంప్రసాద్ రెడ్డి

కర్నూలు, సందేశం టైమ్స్, ప్రతినిధి, ఏప్రిల్ 08, 2026: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, మార్కాపురం తదితర ప్రాంతాల్లో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదాలకు ప్రధానంగా మానవ తప్పిదాలే కారణమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం బస్సు ప్రమాదాల నివారణపై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర పాలిత ప్రాంతాలతో పోల్చితే మన రాష్ట్రంలో వాహనాలపై టాక్సేషన్ ఎక్కువగా ఉండటం వల్ల, ఇతర రాష్ట్రాల్లో రిజిస్టర్ అయిన వాహనాలు ఇక్కడ అధికంగా తిరుగుతున్నాయని ఆయన గుర్తించారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు త్వరలోనే బస్సుల్లో సీట్లపై ఉన్న టాక్సేషన్‌ను తగ్గించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా అవసరమైతే భవిష్యత్తులో స్లీపర్ బస్సులను పూర్తిగా రద్దు చేసే ఆలోచనలో ఉన్నామని, ప్రమాదాల నివారణకు కఠినమైన నిబంధనలు అమలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.



## కేరళ కోవలం యూడీఎఫ్ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

సందేశం టైమ్స్, ఏప్రిల్ 08, ప్రతినిధి: కేరళలో కోవలం నియోజకవర్గ యూడీఎఫ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, పంచాయతీరాజ్ వ్యవస్థలో సాధించిన విజయాలను అభినందిస్తూ, ఎక్కడైనా మంచి జరిగితే మేం అంగీకరిస్తామన్నారు. పినరాయి విజయన్ 120 నెలల పాలన కాలంలో సృష్టించిన వైఫల్యాలను ఎత్తిచూపుతూ, యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్ళిపోవడం వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కువగా కనిపిస్తోందని, ఇలాంటి పరిస్థితి దురదృష్టకరమని గుర్తు చేశారు. తెలంగాణలోని అభివృద్ధి నమూనా కేరళలో అమలు చేస్తామని, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ నియామకాలు, స్వీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా చూస్తామని చెప్పారు. అలాగే పినరాయి విజయన్‌తో పాటు కేరళకు చెందిన మహిళా కమ్యూనిస్టు నేతలను తెలంగాణకు ఆహ్వానించి, అవసరమైన ఏర్పాట్లను అందిస్తామని, తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించవచ్చని తెలిపారు. గత కాలంలో మేము 67 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు, 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.20,670 కోట్ల రుణమాఫీ చేయడం, 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్లు అందించడం వంటి కార్యక్రమాలను సఫలీకృతం చేసినట్లు వివరించారు. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు, ఎన్నికలు కేరళలో యూడీఎఫ్–ఎల్డీఎఫ్ మధ్య జరుగుతున్నవి, తెలంగాణలో మా హామీలు అమలు అవుతున్నాయని, పినరాయి విజయన్ అందుకు సమాధానం ఇవ్వాలి అని ప్రతిపాదించారు.

# తుది దశకు చేరుకున్న విజయవాడ-కాజీపేట మూడో లైన్ ప్రాజెక్టు



విజయవాడ, సందేశం టైమ్స్, ప్రతినిధి, ఏప్రిల్ 08, 2026: తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే అత్యంత కీలకమైన విజయవాడ-కాజీపేట రైల్వే మార్గంలో మూడో లైన్ ప్రాజెక్టు పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. మొత్తం 219 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో ఇప్పటికే 199 కిలోమీటర్ల మేర ట్రాక్ నిర్మాణం మరియు విద్యుదీకరణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయని రైల్వే వర్గాలు వెల్లడించాయి. ఈ కొత్త లైన్ అందుబాటులోకి రావడం వల్ల ప్రధాన మార్గంలో రైళ్ల రద్దీ గణనీయంగా తగ్గి, ప్రయాణీకుల రైళ్లు నిర్ణీత సమయానికి నడిచే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, బొగ్గు మరియు సిమెంట్ వంటి అత్యవసర సరుకుల రవాణా మరింత వేగవంతమై, సంబంధిత పరిశ్రమలకు ముడి సరుకులు సకాలంలో చేరుతాయి. వంద శాతం విద్యుదీకరణతో చేపట్టిన ఈ ప్రాజెక్టు వల్ల ఇంధన ఖర్చులు తగ్గడమే కాకుండా పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని, ఈ మార్గం త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రయాణికులకు మరియు రవాణా రంగానికి అందుబాటులోకి రానుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాలను కాపాడాలి: డీజీపీ శివధర్ రెడ్డి




సందేశం టైమ్స్, ఏప్రిల్ 08, ప్రతినిధి: వెంకటాపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అరీవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా ఆవహించారు. డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే 75 శాతం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి, కారు బెల్ట్ లేకుండా డ్రైవ్ చేయకూడదు, సెల్‌ఫోన్‌తో వాహనం నడపకూడదని, 18 నుంచి 40 ఏళ్ల మధ్యవారే అత్యధిక ప్రమాదాలకు గురవుతారని హెచ్చరించారు. సురక్షిత డ్రైవింగ్ పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ ప్రాణాలను రక్షించుకోవచ్చని, రోడ్ సేఫ్టీ అత్యంత ముఖ్యమని గుర్తుచేశారు. అంతేకాక, ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో పామునూరు అటవీ ప్రాంతంలో కొత్త పోలీస్ ఔట్ పోస్ట్, ఇంటలిజెన్స్ కో ఆర్డినేషన్ సెంటర్ ప్రారంభించిన సందర్భంగా, కర్రెగుట్టల్లో కొత్త రోడ్ల నిర్మాణం అభివృద్ధికి కీలకమని, ప్రాంతానికి రోడ్లు వేయడం అభినందనీయమని, రోడ్ల నిర్మాణం ద్వారా స్థానిక అభివృద్ధి సాధ్యమవుతుందని డీజీపీ శివధర్ రెడ్డి వివరించారు

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.